క్లుప్తంగా

ఘనంగా జాతీయ వినియోగదారుల దినోత్సవం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇంద్రావతి మాట్లాడుతూ.. వినియోగదారుల హక్కుల రక్షణ కోసం మండల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఫోరంలు ఉన్నాయన్నారు. హక్కులపై వినియోగదారులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారన్నారు. వినియోగదారుల దినోత్సవం ప్రాముఖ్యతపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమలో కామర్స్ అధ్యాపకురాలు గాయత్రి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసుల రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎంఎస్ నగర్ సచివాలయాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. సమస్యలు పరిష్కారం కొరకు వచ్చే బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలా కాని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలియజేశారు. అలాగే ఆ వార్డులోని సివిల్ వర్క్‌కు సంబంధించి మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీఈలు, ఏఈలు పరిశీలించారు. అలాగే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

కుంభమేళాకు ప్లేట్లు, గ్లాసుల వితరణ



పంపిణీకి సిద్ధం చేసిన ప్లేట్లు, గ్లాసులు

నంద్యాల(వ్యవసాయం): ఉత్తరప్రదేశ్‌లో జనవరి 15న జరిగే కుంభ మేళా మహోత్సవానికి మంగళవారం ఆర్‌ఎస్‌ఎస్ నంద్యాల విభాగం ఆధ్వర్యంలో గ్లాసులను, బట్ట సంచులను పంపారు. పర్యావరణ కాలుష్య రహిత కుంభ మేళా కొరకు నంద్యాలకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు పినాకపాణి, సముద్రాల నాగరాజు ఆధ్వర్యంలో ఇంటింటి నుంచి 1500 ప్లేట్లు, గ్లాసులు, 2వేలకు పైగా చేతి బట్ట సంచులను సేకరించి ప్రయాగకు రైలులో పంపడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు విశ్వక్రాంతి మధు, దీపు, హుసేన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యుడికి సత్కారం



దంత వైద్యుడిని సన్మానిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ కిశోర్‌కుమార్‌ను సత్కరించారు. ఆయన ప్రస్తుతం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, ఉమ్మడి కర్నూలు జిల్లాల అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు శ్రీనివాస మూర్తి, జిల్లా కార్యదర్శి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, అవ్వారి శేషఫణి, కవులు నరేంద్ర, రఫీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలచే పూలంగి సేవా కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు.

రిటైల్ జనరల్ మార్చెంట్ అసోసియేషన్ ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల పట్టణం రిటైల్ జనరల్ మర్చెంట్ అసోసియేషన్ ఎన్నికల్లో 5వ సారి అడ్డగాళ్ల మల్లికార్జునశెట్టిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించారు. సెక్రటరీగా భీమిశెట్టి నాగప్రసాద్, వైస్ ప్రెసిడెంట్‌గా తిరువీధి అల్లూరయ్య, జాయింట్ సెక్రటరీగా శ్రీనివాస్ గుప్తా, ట్రెజరర్‌గా గెలివి శేఖర్ ఎన్నికయ్యారు.



విద్యుత్ కాంతులతో ఆల్‌సెయింట్ చర్చి



హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి



జూలేపల్లిలో అలంకరించిన సీఎస్ఐ చర్చి



ముత్యాలపాడు ఎస్‌పీజీ చర్చిలో రెవ.డెండి షెపర్డ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ రెవ.ఆరిఫిక సంజీవరాజ్

క్రీస్తు జననం.. లోకానికి వెలుగు

- చర్చిలకు క్రిస్మస్ శోభ
- రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ
- అర్ధరాత్రి నుంచి ప్రత్యేక ప్రార్థనలు



నంద్యాల సీఎస్ఐ చర్చిలో క్రీస్తు జననం నమూనా



విద్యుత్‌దీపాలంకరణలో నంద్యాల పరిశుద్ధ మత్తయి చర్చి



కెథడ్రల్ చర్చిలో విద్యుత్ దీపాలతో ప్రత్యేక ఆకర్షణ



ముత్యాలపాడు చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

నంద్యాల(న్యూటౌన్): క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని జిల్లాలోని పలు ప్రాంతాల్లో చర్చిలు శోభాయమానంగా కాంతులీనుతున్నాయి. ప్రముఖ క్రైస్తవ ఆలయాలు విద్యుత్ దీపాలంకరణతో, రంగు రంగుల పేపర్‌లతో సుందరంగా, శోభాయమానంగా ముస్తాబు చేశారు. నంద్యాల పట్టణంలోని హోలీ క్రాస్ కెథడ్రల్ చర్చి, పాస్టరేట్-2 ఆల్‌సెయింట్ చర్చి, పాస్టరేట్-3 ఆలయం డేనియల్‌పురం సీఎస్ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చి కాకుండా ఏసుకృప, హోసన్న, వైఎస్సార్‌నగర్ క్రిస్టియన్ అసెంబ్లీ, తదితర సంఘాల చర్చిలకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం లోపలి భాగంగా రంగు రంగుల పేపర్లతో, వివిధ ఆకృతులతో అందంగా తీర్చిదిద్దారు. రైల్వే స్టేషన్ రోడ్డులో ఆరోగ్యమాత పుణ్య క్షేత్రం, పరిశుద్ధమత్తయి చర్చిలకు రంగు రంగుల విద్యుత్ దీపాలతో పండుగ శోభ సంతరించుకుంది. క్రైస్తవులు స్టార్‌లను ప్రతి ఇంటిపై ఎగువేశారు. పలు ప్రధాన వీధుల్లో నిలువెత్తు స్టార్‌లను ఏర్పాటు చేశారు. వీధివీధిలో క్రిస్మస్ సంబంధించిన వాఖ్యాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

హోలీక్రాస్ కెథడ్రల్‌లో బిషప్ సందేశం..

నంద్యాల మండలంలోని అన్నిగ్రామాల్లో క్రిస్మస్ శోభ సంతరించుకుంది. మిట్నాల, చాపిరేవుల, గుంతనాల, పెద్దకొట్టాల, అయ్యలూరు, చాబోలు, రాయమాల్పురం, మునగాల, పోలూరు, తదితర గ్రామాల్లో క్రిస్మస్ సందర్భంగా అన్ని సీఎస్ఐ చర్చిలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు సంఘ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1(పెద్దచర్చి)లో రైట్ రెవరెండ్ జార్జి కొర్నెలి బిషప్ దైవ సందేశం అందిస్తారు. అలాగే పాస్టరేట్-2 ఆలయంలో రిటైర్డు బిషప్ ఎగ్గోని పుష్పలితమ్మ, డీసరీ చైర్మన్ ఇమ్మానియేల్ బాబు, మిటాన్ల సీఎస్ఐ ఆలయంలో కాంతరావుతో పాటు అన్ని గ్రామాల్లో సంఘ కాపరులు క్రిస్మస్‌సందేశం ఇవ్వనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో క్రిస్మస్ శోభ

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో క్రిస్మస్ శోభ సంతరించుకుంది. ఆయా గ్రామాల్లోని చర్చిలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. క్రిస్మస్ వేడుకలు సందర్భంగా చర్చిలను ప్రత్యేకంగా రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి నుంచి ఆయా చర్చిలలో పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

ఆళ్లగడ్డ : క్రిస్మస్ సంబరాలు మంగళవారం నియోజకవర్గ పరిధిలో అంబరాన్నంటాయి. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ గ్రామానా ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలు, స్టార్లతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. బాల ఏసు విగ్రహాలను పెట్టి ఏసుక్రీస్తు జననం తీరును తెలిపేలా పాకల సెట్టింగులు పెట్టారు. ప్రైవేటు పాఠశాలల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఏర్పాటు చేసి విద్యార్థు మధ్య కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. మున్సిపాలిటి పరిధిలోని సీఎస్ఐ, ఇమ్మానియల్, రెహబోతు, ఆర్సీఎం, హోసన్న, పెంతకోస్తు, గెస్సెమనే, జోసప్, ఏసు కృప తదితర మందిరాల పాస్టర్లు అర్ధరాత్రి అనంతరం మత, సంఘ పెద్దల ఆధ్వర్యంలో సభ్యులు శిలువ చేత పట్టుకుని ఇంటింటికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొందరు భక్తులు కొవ్వొత్తులు చేత బూని క్రీస్తు గురించి కీర్తనలు ఆలపిస్తు ఆయా కాలనీల్లో ఇల్లిల్లూ తిరిగుతూ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా క్రిస్మస్ పండుగ

చాగలమర్రి: లోక రక్షకుడు, ప్రభువు ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా క్రిస్మస్ పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. 24వ తేదీన అర్ధరాత్రి ప్రభువు పుట్టడంతో లోకంలో కాంతి వెదజల్లబడినదనేదానికి గుర్తుగా చర్చిల వద్ద, ఇళ్ల వద్ద ప్రకాశిస్తున్న నక్షత్రాలను ఏర్పాటు చేశారు. ఏసుక్రీస్తు పశువుల పాకలో జన్మించినందుకు గుర్తుగా క్రిస్మస్ పండుగ సందర్భంగా చర్చిలను పెయింటింగ్‌లతో, విద్యుత్ దీపాలతో అలంకరించి చర్చిల ఆవరణలో పశువుల పాకను ఏర్పాటు చేసి అలంకరించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి క్రైస్తవ సోదరులు పిల్లల నుంచి పెద్దల వరకు నూతన వస్త్రాలను ధరించి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలోని ఎస్‌పీజీ చర్చిని సర్ డెండ్లీ షెపర్డ్ 134 సంవత్సరాల క్రితం నిర్మించారు. ఆయన భౌతిక కాయాన్ని చర్చి ఆవరణంలోనే ఖననం చేశారు. క్రిస్మస్ సందర్భంగా మంగళవారం రాత్రి ఆయన సమాధిని విద్యుత్ దీపాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ప్రార్థనా మందిరాలు ముస్తాబు

రుద్రవరం/దొర్నిపాడు: మండలంలోని గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రార్థనా మందిరాలు అందంగా ముస్తాబు అయ్యాయి. బుధవారం క్రిస్మస్ పండుగా కావడంతో క్రైస్తవ సోదరులు తమ ఇళ్లను ముస్తాబు చేసుకోవడంతో పాటు కాలనీల్లో ఉన్న ప్రార్థనా మందిరాలకు రంగులద్దారు. అలాగే రంగు రంగుల విద్యుద్దీపాలతో ఆకర్షణీయంగా అలంకరించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పట్టణంలోని శ్రీసంకల్ప్ పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధినేత సుధాకర్, ప్రిన్సిపాల్ దివ్యకోసి పాల్గొన్నారు. విద్యార్థుల వేషధారణలు, నృత్యాలు, నాటకాలు ఆకట్టుకున్నాయి.



క్రీస్తు పుట్టుక సన్నివేశాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం



విద్యుద్దీపాలంకరణలో సర్పాపురం ప్రార్థనా మందిరం



విద్యుత్ దీపాలతో దొర్నిపాడులోని చర్చి

విద్యుత్ చార్జీల పెంపుపై 'పోరుబాట'



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మలసత్రం: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమం చేపడుతోందని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, చైర్‌పర్సన్ మాబున్నిసా ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 27న పార్టీ శ్రేణులు, ప్రజలతో కలిసి నిసరన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందరితో కలిసి విద్యుత్ శాఖ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం సమర్పిస్తామని వివరించారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల కాలంలో రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెను భారాన్ని మోపిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని చంద్రబాబు మొసలి కన్నీరు కార్చి ప్రజలను మోసం చేశారన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 27న నిర్వహించే కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయశేఖర్ రెడ్డి, దేశం సుధాకర్‌రెడ్డి, అమీర్, శశికళారెడ్డి కౌన్సిలర్లు విజయభాస్కర్, చంద్రశేఖర్, ఆరీఫ్‌నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి , సాయిరామ్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, కిరణ్, టైలర్ శివ, ఎద్దు రవి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పిచికారీతో మంచి ఫలితాలు



ఎర్రగుడిదిన్నె వద్ద డ్రోన్‌తో పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

రుద్రవరం: డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని ఏఓ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని ఎర్ర గుడిదిన్నె, పేరూరు గ్రామాల పరిధిలో మంగళవారం ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల పరిధిలో సాగు చేసిన మినుము, జొన్న, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎర్రగుడిదిన్నె వద్ద ఎపుగా పెరిగిన జొన్న పంటలో తెగుళ్ల నివారణకు రసాయన పురుగుల మందును డ్రోన్ ద్వారా పిచికారీ చేయించి, తద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. అలాగే పేరూరు వద్ద పంటలను ఆశించే తెగుళ్లు, వాటిని నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది గ్లోరి, భవాని తదితరులు ఉన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

ఉయ్యాలవాడ : ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించాలని వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో సాగు చేసిన శనగ పంటను రైతులతో కలిసి పరిశీలించారు. తుపాన్లు, అధిక వర్షాల ప్రభావంతో భూమిలో తేమ శాతం అధికంగా వుండడంతో శనగ పంటకు వేరుకుళ్లు తెగుళ్లు ఆశించినట్లు గుర్తించామన్నారు. నివారణకు సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలని సూచించారు. శనగ పంట ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతినే ప్రమాదం వుందని, ఫసల్ బీమా ప్రీమియం చెల్లించని రైతులు ఎవ్వరైనా వుంటే ఈ నెల 31వ తేదీలోగా మీ సేవా, సీఎస్‌సీ కేంద్రాలలో చెల్లించాలన్నారు.

అంగన్‌వాడీలకు వంట పాత్రల పంపిణీ



మెటీరియల్‌ను అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): ఎస్‌బీఐ పాన్ ఇండియా, సీఎస్ఆర్ యాక్టివిటీస్ అప్‌గ్రేడింగ్ ఆధ్వర్యంలో మిత్ర, హోలిస్టిక్ హెల్త్ సొసైటీ చైర్మన్ లక్ష్మి పర్యవేక్షణలో మంగళవారం పట్టణంలోని వీసీ కాలనీ, నివర్తినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.లక్ష విలువ చేసే వాటర్ ఫిల్టర్, రైస్ కుక్కర్, టీవీ, ప్లేట్లు, తదితరాలను అందజేశారు. సూపర్‌వైజర్ నజీరా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో ఆరోగ్యవంతమైన పౌష్టికాహారం అందించేందుకు మెటీరియల్‌ను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

గోవిందపల్లెలో రెవెన్యూ సదస్సు

శిరివెళ్ల: గోవిందపల్లెలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రీ- సర్వేపై ఇరువురు రైతులు తమ సమస్యలను పరిష్కరించమని తహసీల్దార్ పుష్పకుమారికి అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్, మండల సర్వేయర్ చిన్న మల్లయ్య, వీఆర్వోలు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమాకు నెలాఖరు వరకు గడువు

దొర్నిపాడు: పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు ఈనెలాఖరు వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి ప్రమీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట డిసెంబరు 15 చివరి తేదీగా ఉండేదని చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించలేక పోవడంతో, డిసెంబర్ 31 వరకు పెంచినట్లు చెప్పారు. తగిన ధ్రువపత్రాలు అందించి మీసేవ, సచివాలయాల్లో రైతులు ప్రీమియం చెల్లించుకోవచ్చన్నారు. అలాగే రబీలో ఈ- క్రాప్ నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఆధార్ సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ : మండల పరిధిలో సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అల్లూరు గ్రామ సచివాలయంలో 26, మాయలూరు గ్రామ సచివాలయంలో 27, 28 తేదీలలో వరుసగా నాలుగు రోజుల పాటు ఆధార్ నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, పాఠశాలల్లో చదువు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు

రుద్రవరం: విధుల పట్ల అలసత్వం వహించొద్దని ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సచివాలయ సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని చిన్నకంబలూరు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, పీఏసీఎస్ ఈకేవైసీని వేగవంతంగా చేయాలని చెప్పారు. అలాగే సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.

ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చెల్లించాలి

నంద్యాల(అర్బన్): జిల్లాలోని ఎండీయూ వాహనాలకు ఇన్సూరెన్స్ ప్రభుత్వమే భరించాలని ఎండీయూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాజా శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ఎండీయూ ఆపరేటర్లు మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆపరేటర్ల వేతనాలు ఆలస్యంగా విడుదలవుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఎండీఎంలకు అందించే రేషన్ పంపిణీకి సంబంధించి బిల్లుల చెల్లింపులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలువురు రేషన్ డీలర్లు ఎండీయూ వాహనాలకు రేషన్ అప్పగించకుండా స్వతంత్రంగా పంపిణీ చేస్తున్నారన్నారు. అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎండీయూలు రమణ, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పొన్నాపురం కాలనీలోని ప్రత్యేక దత్తత కేంద్రంలో చంటి పాపను లాలిస్తున్న జిల్లా కలెక్టర్

నంద్యాల: కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కార్యాలయాల్లోని చుట్టుపక్కల ప్రదేశాలు దురాక్రమణలకు గురికాకుండా పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. పొన్నాపురం కాలనీలో ఉన్న డివిజనల్ పంచాయతీ కార్యాలయం, సచివాలయం-2, అంబేడ్కర్ భవన్, సాంఘిక సంక్షేమ కార్యాలయం, చంటి పిల్లల ప్రత్యేక దత్తత కేంద్రాలను పరిశీలిస్తూ సిబ్బంది, కార్యకలాపాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. చంటి పిల్లల ప్రత్యేక దత్తత కేంద్రాన్ని చక్కగా, పరిశుభ్రంగా ఉంచుకున్నారని కలెక్టర్ ప్రశంసించారు.


ఎన్‌సీసీ విద్యార్థుల సేవలు అభినందనీయం



బహుమతులు అందుకున్న ఎన్‌సీసీ విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): దివ్యాంగుల దినోత్సవం రోజు దివ్యాంగులకు విశిష్ట సేవలు అందించిన రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులను నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో అభినందించారు. సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, రామచంద్రరావులు మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం రోజున ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, వాటిని దివ్యాంగులకు అందించడంలో ఎన్‌సీసీ విద్యార్థులు అందించిన విశిష్ట సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణారెడ్డి, కందుకూరు శ్రీరామమూర్తి, డాక్టర్ విజయ్‌బాబు, రమేష్, నిజాముద్దీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్

చాగలమర్రి: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు, వ్యాపార వేత్త చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం చక్రం కాంప్లెక్స్‌లోని తన కార్యాలయం వద్ద బట్టలు పంపిణీ చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. ప్రతి ఏడాది క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని స్థానిక పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న 20 మందికి దుస్తులు పంపిణీ చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ.. చాలీ చాలని చిన్నపాటి వేతనాలతో ఎన్నో ఇబ్బందులతో కుటుంబాలను పోషించుకుంటున్న వారికి తమ వంతు సహాయంగా, పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో గత ఐదేళ్లుగా పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, వార్డు సభ్యుడు కె.అబ్దుల్లా, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

తొలగని భయం



ఆర్.నాగులవరం వద్ద ధాన్యంపై తొలగని పట్టలు

రుద్రవరం: అల్పపీడన ప్రభావం రైతులను వదలడం లేదు. రైతులను వెంటాడుతూనే ఉంది. దీంతో రైతుల్లో భయం నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మొక్క జొన్న, వరి, మినుము వంటి పంట కోతలు ఆరంభం అయినప్పటి నుంచి వరుసగా తుపానులు ప్రభావం చూపుతున్నాయి. ఓ వైపు పంట కోతలు కోయించి ధాన్యాన్ని విక్రయించుకునే సమయంలో వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం కురుస్తోంది. దీంతో ఆరబోసిన ధాన్యం తడవకుండా రైతులు పట్టలు కప్పుకున్నారు. త్వరిత గతిన ధాన్యం విక్రయించుకోవాలని యత్నిస్తున్న కొనుగోలు దారులు ముందుకు రావడంలేదని, దీంతో ధాన్యాన్ని రోడ్లపైనే ఉంచుకున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే ఆర బోసిన ధాన్యం ఎక్కడ తడుస్తుందోనని రైతులు వాపోయారు.